క్లుప్తంగా

సత్య కళాశాలలో క్యాంపస్ డ్రైవ్



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి మాట్లాడుతూ.. ఫోక్సకస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో తమ కళాశాల విద్యార్థులకు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి రంగోత్సవాలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి రంగోత్సవ పోటీలకు గొట్లాం ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీరామాచారి గురువారం తెలిపారు. ఈనెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి రంగోత్సవ పోటీల్లో రోల్‌ప్లే విభాగంలో విద్యార్థులు సీహెచ్.చరణ్, ఎం.భార్గవ్, టి.అఖిల్, బి.అజయ్ మహనోహర్,స్లోగన్ విభాగంలో కె.జగదీశ్వరీ ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 24న విజయవాడలో నిర్వహించనున్న పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్‌ఎం చెప్పారు.విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ యు.సత్యానంద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదర్శ మిత్రులు

- అవయవదానానికి ముందుకొచ్చిన ఆరుగురు యువతీ, యువకులు

చీపురుపల్లి: సామాజిక స్పృహపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, నలుగురు కలిసినప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వడం కాదు చేసి చూపించాలి అనుకున్నారు ఆ మిత్రులు. మనం చెప్పడం కాదు మరికొందరికి ఆదర్శం కావాలని భావించారు. అందుకే ఆ ఆరుగురు మిత్రులు తీసుకున్న నిర్ణయం ఎంతోమందికి ఆదర్శకానుంది. ఇంతకీ ఎవరు వారు, వారేం చేశారని అనుకుంటున్నారా. పట్టణానికి చెందిన శేషపు శ్రీసాయి, మండల చైతన్య, ముత్తా కల్యాణ్, పెద్ది వెంకటేష్, బి.సాయిరెడ్డి, పి.నందిని మిత్రులు. వీరంతా వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. తమ మరణాంతరం అవయవదానం చేసేందుకు అంగీకారం తెలుపుతూ దరఖాస్తులపై సంతకాలు చేసి మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులకు గురువారం అందజేశారు. చాలా కాలంగా మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవయవదానంపై చేస్తున్న అవగాహన కార్యక్రమాలకు వీరు ఆకర్షితులయ్యారు. మరణించాక శరీరం అంతా మట్టిలో కలిసిపోవడం కంటే మరికొంత మందికి ఉపయోగపడడంతో పాటు ప్రయోగాలకు దోహదపడుతుందని ఆలోచన చేశారు. దీంతో అవయవదానం చేసేందుకు అంగీకార పత్రాలు అందజేశారు.

సస్పెండ్ చేశారు.. ఎత్తేశారు..!

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన శాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అనుచిత ప్రవర్తన, అసభ్యకర బోధన, సహ ఉపాధ్యాయినిని కులం పేరుతో కించపరిచే వ్యాఖ్యలు చేయడంపై జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ ఇచ్చిన నివేదిక మేరకు ఆయనను గతేడాది డిసెంబర్ 20న సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఏమైందో ఏమో తెలియదు.. ఆయనపై ఎలాంటి కేసు నమోదుకు సిఫార్సు చేయకుండానే తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. పనిసర్దుబాటు కింద చీపురుపల్లి మండలంలోని ముక్కాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పంపించేశారు. దీనిపై ఫిర్యాదు ఇచ్చిన ఉపాధ్యాయినితో పాటు గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అధికారుల తీరును తప్పుబడుతున్నారు. ఉపాధ్యాయుడి కీచకబుద్ధిని అధికారుల ముందు పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఏకరువు పెట్టినా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కులంపేరుతో దూషించడం, అసభ్యకర మాటలతో అవమాన పర్చడంపై ఫిర్యాదు చేసినా విచారణ జరపలేదని, దళిత మహిళలను కావడం, రాజకీయ పలుకుపబడి లేకే ఉన్నతాధికారులు నా ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోలేదని ఉపాధ్యాయిని యడ్ల కృష్ణవేణి వాపోయారు. ఇదే విషయాన్ని డీఈఓ మాణిక్యంనాయుడు వద్ద ప్రస్తావించగా ఉపాధ్యాయుడిపై వచ్చిన ఫిర్యాదు, ఆరోపణలపై జరిపిన విచారణలో చర్యలు తీసుకునేదిగా లేదని తేలిందన్నారు. సస్పెన్షన్ చేసిన ఉపాధ్యాయుడిని ఎక్కువ రోజులు గాలిలో ఉంచకూడదన్న ఉద్దేశంతో విధుల్లోకి తీసుకున్నామన్నారు. ఆయనకు ఒక అవకాశం ఇచ్చామని, మరోసారి ఆయనపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

ఆదాయ సముపార్జనే ధ్యేయం..

- తెరపైకి ఎల్‌ఆర్‌ఎస్ పథకం
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి నిబంధనలు సడలింపు



లే అవుట్‌లో హద్దులను పరిశీలిస్తున్న ప్రణాళిక విభాగం అధికారులు

విజయనగరం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయమే ధ్యేయంగా నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. అభివృద్ధి పనులకు సంబంధించి ఎటువంటి నిధులు మంజూరు చేయకున్నా.. ప్రజల నుంచి వివిధ రూపాల్లో రావాల్సిన పన్నుల బకాయిలపై మాత్రం ఒత్తిడి తీసుకువచ్చి ఖజానా నింపుకోవడంలో ఉత్సాహం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్తి, ఖాళీ స్థలాలు, తాగునీటి పన్ను బకాయిల వసూళ్లలో అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న ప్రభుత్వం.. తాజాగా గత టీడీపీ హయాంలో అమలు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని మరోసారి తెరపైకి తీసుకువచ్చింది. అప్పట్లో పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల అనుమతులపై కూటమి ప్రభుత్వం నిబంధనలు సడలించి తద్వారా ఆదాయాన్ని రాబట్టుకునే పనిలో పడింది. దీంతో గత ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వాటిని క్రమబద్ధీకరించేందుకు పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభించింది. 2019 ముందు వచ్చిన దరఖాస్తులను వెలికి తీయించి వాటి ద్వారా ఆదాయం సమకూర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదేళ్ల కిందట 609 పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. వీటిలో 138కి పైగా దరఖాస్తులను అప్పట్లో పరిష్కరించారు. మిగిలినవి వివిధ కారణాల రీత్యా పెండింగ్‌లో ఉండిపోయాయి. వాటిపై ఆధారపడి డవలప్‌మెంట్ కోసం ముందస్తు పెట్టుబడులు పెట్టిన వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ప్రభుత్వం స్పందించడంతో గతంలో దరఖాస్తు చేసుకున్న వారు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం కార్పొరేషన్ ప్రణాళిక విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

వసతులు మెరుగుపరిచే అవకాశం..

లేఅవుట్ల అనుమతుల విషయంలో చిక్కులు తొలగించడం ద్వారా పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో అర్బన్ డవలప్‌మెంట్‌కు ప్రభుత్వం పాత దరఖాస్తులను తిరగవేస్తోంది. ఆయా ప్రాంతాల్లో తాగునీరు, మౌలిక సదుపాయాలు, రవాణా వంటి వసతులు మెరుగుపర్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ముందు పూర్తి చేయాలని నిర్ణయించింది. గత పెండింగ్ దరఖాస్తులకు ప్రస్తుతం అవకాశం కల్పించారు. కార్పొరేషన్ పరిధిలో గతంలో వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎల్‌ఆర్‌ఎస్ విధానంలో పూర్తి చేసే అవకాశం ఉందని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఆయా వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక మేళాలు నిర్వహించి లోపాలను సవరించే దిశగా సూచనలు ఇస్తున్నాం. అన్ని పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తులు పరిష్కరిస్తున్నాం. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

కొనసాగుతున్న పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్టయిఫండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ, పీఈటీ పరీక్షల ప్రక్రియ కొనసాగుతోందని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఎనిమిదో రోజైన గురువారం దేహ దారుఢ్య పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 375 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువజామున 5 గంటల నుంచే ప్రారంభం కావడంతో సకాలంలో పూర్తయ్యాయని చెప్పారు. నియామకాల ప్రక్రియను ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. హాల్‌టికెట్లను పరిశీలించి అభ్యర్థులను గ్రౌండ్‌లోకి అనుమతించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.బాపూజీ, టీఎస్.శ్రీనివాసరావు, కె.థామస్‌రెడ్డి, ఏటపి.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, పీఈటీలు, ఇతర పోలీస్ అధికారులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థిని పరిశీలిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

డ్రమ్‌సీడర్‌తో అధిక దిగుబడి

విజయనగరం రూరల్: రబీ సీజన్‌లో వరిసాగు చేస్తున్న రైతులు నీరు సమృద్ధిగా ఉన్నచోట డ్రమ్‌సీడర్‌తో విత్తుకోవడం వల్ల సాగు ఖర్చు రూ.5 వేల వరకు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి లత తెలిపారు. మండలంలోని దుప్పాడ గ్రామానికి చెందిన రైతు సుబ్బరాజు పొలంలో డ్రమ్ సీడర్ వినియోగాన్ని స్థానిక ఏఈఓ హైమాతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రమ్ సీడర్‌తో వేసిన వరిపంటకు కలుపు రాకుండా ఉండడం కోసం విత్తిన రెండురోజుల్లో పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ అనే మందు 80 గ్రాములను 20 కిలోల ఇసుకలో కలపి చల్లుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల కలుపు ఉధృతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. పరిశీలనలో వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.



డ్రమ్ సీడర్ వినియోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ లత, తదితరులు

వస్తున్నారు.. వెళ్తున్నారు.



21వ డివిజన్ వార్డు పర్యటనలో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్, తదితరులు

- మొక్కుబడిగా వార్డు పర్యటనలు

విజయనగరం: ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రతి గురువారం నిర్వహిస్తున్న వార్డుపర్యటన కార్యక్రమాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. అధికారులు, పాలకవర్గ సభ్యులు వస్తున్నారు.. చూస్తున్నారు.. వెళ్తున్నారు. అధికారులు కేవలం తమ ప్రచారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా తమకు ఒరిగిందేమీ లేదని ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. కొందరు అధికారులు, స్థానిక కార్పొరేటర్‌తో కలిసి వార్డులో పర్యటించి మమః అనిపించేస్తున్నారన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. నగరంలోని 21వ డివిజన్‌లోని నాగవంశంవీధిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లితో కలిసి పర్యటించారు. ప్రతి వారంలానే ఈ వారం కూడా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును మొక్కుబడిగా పరిశీలించి వెనుదిరిగారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో సీతం కళాశాల ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ఎం.డి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్:

ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. ఈ మేరకు గురువారం స్థానిక సీతం కళాశాలలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లగడపాటి శ్రీనివాసరావు, సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి ఎంఓయూపై సంతకం చేశారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా శిక్షణ, విద్య, నియామకం, పారిశ్రామిక సందర్శన, నిపుణుల ఉపన్యాసాలు, కెరీర్ కన్సల్టెన్సీ, ప్లేస్‌మెంట్, తదితర అంశాల్లో పరస్పర సహకారం అందించుకుంటున్నారు.

ఈ సందర్భంగా సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ.. సీతం విద్యార్థులు అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ లాంటి వివిధ దేశాలలో ఉన్నత విద్యలను అభ్యసించడానికి ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందన్నారు.



నెల్లిమర్ల: సంక్రాంతి సంబరాల్లో సరస్వతీ శిశుమందిర్ చిన్నారులు



డెంకాడ: చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



డెంకాడ: అక్కివరం ఏపీ మోడల్‌స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు



విజయనగరం అర్బన్: ప్రైవేట్ పాఠశాలలో చిన్నారుల సందడి



నెల్లిమర్ల రూరల్: ఒమ్మి ప్రాథమిక పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

సరదాల సంక్రాంతి ..

సంక్రాంతి సంబరాలు వాడవాడలా గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సంబరాలు అంగరంగవైభవంగా జరిగాయి. ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పండగ వాతావరణాన్ని తలపించారు. భోగి మంటలు వేశారు.. గాలిపటాలు ఎగురవేశారు.. డూడూ బసబన్నవలు, జంగమదేవరలు, తదితర వేషధారణలతో చిన్నారులు అలరించారు. మొత్తానికి పాఠశాలలకు మాత్రం సరదాల సంక్రాంతి ముందే వచ్చేసింది.

– డెంకాడ/ నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్



డెంకాడ: భోగి మంట వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు



విజయనగరం అర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చిన్నారుల నృత్యం

భక్త కోటికి ముక్తి మార్గం

- నేడు ముక్కోటి ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనాలకు సిద్ధమవుతున్న వైష్ణవాలయాలు
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు
- వేంకటేశ్వరస్వామి దర్శనానికి తరలిరానున్న భక్తులు



టీటీడీలో వైకుంఠ ద్వార దర్శనానికి ముస్తాబవుతున్న ఆలయం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

విజయనగరం టౌన్:

భక్త కోటికి ముక్తిమార్గం ఉత్తర ద్వార దర్శనం. సూర్యుడు ఉత్తరాయణంలోకి వచ్చే ముందు ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ మహా పర్వదినం పురస్కరించుకుని వైష్ణవ దేవాలయాల్లో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భారీఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం వేకువజామున నాలుగు గంటల నుంచే స్వామివారి దర్శనం కోసం బారులు తీరనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసింది. స్థానిక టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో కొలువైన స్వామివారికి శుక్రవారం వేకువజామునుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పీవీ నరసింహాచార్యులు తెలిపారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే తోటపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయ ప్రధాన మండపాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పాలకమండలి ఏర్పాట్లు పూర్తిచేసింది. శివాలయం వీధిలో కొలువైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వాసుదేవాచార్యులు తెలిపారు. అలాగే రింగురోడ్డులో ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, దీపారాధనలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి చెరుకూరి శ్రీధర్ తెలిపారు. మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చకుడు ఫణిహారం మణిబాబు తెలిపారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోతయ్యపాలెం, చొల్లంగిపేట, నగరాపుపేట, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.